Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 60 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 01.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

- కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్



- మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ
- ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి

నిత్యం నిఘా, హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట – మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

అమెరికాతో ఉద్రిక్తతలు

- భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు



- ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ
- ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి »2
- శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం
- కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారు

- రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ »2

ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు

- 219 'వేలాడే' హిమానీనదాలు!

- ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలను గుర్తించిన పరిశోధకులు
- వీటిలో మూడో వంతు మంచు అస్థిరంగా ఉందని అధ్యయనంలో వెల్లడి
- ఈ గ్లేసియర్లు కూలితే భారీ వరదలు, విపత్తులు సంభవించే ప్రమాదం »2
- వాతావరణ మార్పుల వల్లే ఈ ముప్పు పెరుగుతోందని నిపుణుల ఆందోళన



రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

- కూనంనేని సంచలన వ్యాఖ్యలు



- మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్న కూనంనేని
- స్వేచ్ఛ లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరిక
- సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదని కొండా సుస్మితకు సూచన »2
- రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలన్న కూనంనేని
- కోటి ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని వెల్లడి

నిర్భయ తరహాలో ఘోరం

కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం



- గ్రేటర్ నోయిడాలో కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్
- లిఫ్ట్ అడిగితే బస్సులోకి ఎక్కించుకుని అఘాయిత్యం
- బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఢిల్లీలో వదిలేసి పరారైన నిందితులు

నిత్యం నిఘా, గ్రేటర్ నోయిడా : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నిర్భయ ఘటనను గుర్తుచేసేలా మరో దారుణం గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ ... »2

రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోకుంటే రాజీనామా చేస్తాం..

- విజయ్ పార్టీకి కాంగ్రెస్ అల్టిమేటం

- 2029 ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించాలని టీవీకేకి కాంగ్రెస్ హుకుం
- లేదంటే తమిళనాడు కేబినెట్ నుంచి వైదొలుగుతామన్న కాంగ్రెస్ మంత్రులు
- సీఎం విజయ్‌ను తదుపరి ప్రధానిగా టీవీకే నేతలు ప్రచారం చేయడమే వివాదానికి కారణం



నిత్యం నిఘా, తమిళనాడు : తమిళనాడులో అధికార సంకీర్ణ ప్రభుత్వంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించకపోతే, తాము కేబినెట్ నుంచి వైదొలుగుతామని మిత్రపక్షమైన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని కాంగ్రెస్ మంత్రులు హెచ్చరించారు. ఈ పరిణామం ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కన్యాకుమారిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఎస్. రాజేశ్ కుమార్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "2029లో రాహుల్ గాంధీయే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి. ఆయనే తదుపరి ప్రధాని అవుతారు. ఒకవేళ ఈ ప్రతిపాదనను టీవీకే ..... »2

తెలంగాణలో చురుగ్గా రుతుపవనాలు..

పలు జిల్లాలకు హెచ్చరిక



తెలంగాణలో పలు జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ

బంగాళాఖాతం ప్రభావంతో చురుగ్గా రుతుపవనాలు

ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు

గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక »2

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 2


రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

- కూనంనేని సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు

- 219 'వేలాడే' హిమానీనదాలు!



మొదటిపేజీ తరువాయి.. హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విపత్తులకు దారితీసే మరో పెనుముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయాల్లో ఏకంగా 219 'వేలాడే హిమానీనదాలు' (హ్యాంగింగ్ గ్లేసియర్స్) ఉన్నాయని, వాటిలో మూడో వంతు మంచు నిల్వలు అత్యంత అస్థిరంగా ఉన్నాయని ఈ పరిశోధన తేల్చింది. ఈ వివరాలు అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'నేచురల్ హజార్డ్స్'లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా లోయల్లో ఉండే హిమానీనదాలతో పోలిస్తే, నిటారుగా ఉండే కొండ వాలులపై ఉండే ఈ 'వేలాడే హిమానీనదాలు' చాలా బలహీనంగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతం వేగంగా వేడెక్కుతుండటంతో, ఇవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అధ్యయనం ప్రకారం, ఉత్తరాఖండ్‌లో గుర్తించిన 219 హిమానీనదాల మొత్తం 2.39 క్యూబిక్ కిలోమీటర్ల మంచు ఉండగా, అందులో 0.74 క్యూబిక్ కిలోమీటర్ల మేర మంచు అస్థిరంగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో 2013లో కేదార్‌నాథ్, 2021లో చమోలీ, 2023లో సిక్కింలో సంభవించిన పెను విపత్తులకు ఇలాంటి హిమానీనదాల విస్ఫోటనాలే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సహకారంతో అత్యంత ప్రమాదకరమైన 13 హిమనద సరస్సులపై నిరంతర నిఘా ఉంచింది.

తెలంగాణలో చురుగ్గా రుతుపవనాలు..

పలు జిల్లాలకు హెచ్చరిక



మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దానికి అనుబంధంగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఇక హైదరాబాద్ నగరంలో ఈరోజు మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో పలు చోట్ల ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

అమెరికాతో ఉద్రిక్తతలు: భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

మొదటిపేజీ తరువాయి.. అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్–అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతి భద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారు - రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

నిర్భయ తరహాలో ఘోరం..

- కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నిర్భయ ఘటనను గుర్తుచేసేలా మరో దారుణం గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న జరిగిన ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వివరాలు ఇప్పుడు దేశాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన 16 ఏళ్ల బాలిక, చదువు విషయంలో తల్లి మందలించడంతో ఇంట్లో చెప్పకుండా నోయిడాలోని తన బంధువుల ఇంటికి బయలుదేరింది. అయితే, చీకటి పడటం, భారీ వర్షం కురుస్తుండటంతో నోయిడాలోని ప్యారీ చౌక్ వద్ద బస్సు దిగింది. అప్పటికే రాత్రి 9 గంటలు కావొచ్చింది. తాను చేరాల్సిన గమ్యం ఇంకా 25 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలుసుకుని, వర్షంలో తడుస్తూ ఒంటరిగా నిల్చుంది. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆమె దగ్గర ఆగింది. అది లాంగ్ డిస్టెన్స్ ప్రయాణాల కోసం ఉపయోగించే స్లీపర్ బస్సు కావడం, అందులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం గమనార్హం. తాము కూడా నోయిడా సెక్టార్ 63 వైపే వెళుతున్నామని కండక్టర్ చెప్పడంతో బాలిక బస్సు ఎక్కింది. వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లోని ఓ వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే చంపేస్తామని డ్రైవర్, కండక్టర్ ఆమెను బెదిరించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం తర్వాత, బాధితురాలిని ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వద్ద రింగ్ రోడ్ సమీపంలో వదిలేసి పరారయ్యారు. ధైర్యం కూడగట్టుకున్న బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)లను ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో అరెస్ట్ చేశారు. విశ్వనాథ్ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బృందం బస్సులో బాధితురాలి వెంట్రుకలను గుర్తించింది. స్లీపర్ బస్సు కావడంతో బెర్తులకు కర్టెన్లు ఉండటాన్ని నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని పోలీసులు తెలిపారు. బస్సు ప్రయాణించిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజీని సేకరించి దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితులు గత రెండేళ్లుగా ఇదే ట్రావెల్స్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది.

రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోకుంటే రాజీనామా చేస్తాం..

- విజయ్ పార్టీకి కాంగ్రెస్ అల్టిమేటం

మొదటిపేజీ తరువాయి.. అంగీకరించడానికి నిరాకరిస్తే, కేబినెట్‌లో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ మంత్రులం తక్షణమే రాజీనామా చేసి బయటకు వస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ లక్ష్యం ఇదేనని, కార్యకర్తలందరూ దీనికే ప్రాధాన్యత ఇస్తారని ఆయన అన్నారు.

వివాదానికి కారణమేమిటి?

ఇటీవల కాలంలో పలువురు టీవీకే నేతలు తమ అధినేత, సీఎం విజయ్‌ను జాతీయ స్థాయి నేతగా, భవిష్యత్ ప్రధానిగా అభివర్ణించడమే ఈ వివాదానికి ఆజ్యం పోసింది. మానవ వనరుల శాఖ మంత్రి డి. శరత్‌కుమార్ ఏకంగా అసెంబ్లీలోనే మాట్లాడుతూ "విజయ్ తదుపరి భారత ప్రధాని" అని వ్యాఖ్యానించారు. మరో మంత్రి, ఆధవ్ అర్జున మాట్లాడుతూ దేశానికి దక్షిణాది నుంచి ప్రధాని రావాల్సిన అవసరం ఉందని వాదించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘనవిజయం తర్వాత విజయ్ నాయకత్వంపై జాతీయ స్థాయిలో ఆసక్తి పెరుగుతోందని మరికొందరు టీవీకే నేతలు పేర్కొంటున్నారు. ఈ ప్రచారమే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

కాంగ్రెస్ బలం.. వైఖరి

టీవీకే నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ గట్టిగా స్పందించింది. 2029 ఎన్నికలకు రాహుల్ గాంధీ మాత్రమే తమ ఏకైక జాతీయ అభ్యర్థి అని ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు పునరుద్ఘాటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడినప్పుడు, ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతుతోనే టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ మద్దతు కారణంగానే దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీకి తమిళనాడు కేబినెట్‌లో చోటు దక్కింది. ఈ రాజకీయ బలాన్నే కాంగ్రెస్ ఇప్పుడు గుర్తు చేస్తోంది.

2024లో నటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే పార్టీ, పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే అనూహ్య విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే, 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇంకా మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ, ప్రధాని అభ్యర్థిపై ఇప్పటి నుంచే మొదలైన ఈ చర్చలు సంకీర్ణ ప్రభుత్వంలో స్పష్టమైన విభేదాలకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణమవుతాయోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 3

చిన్నారి మహాన్వీ చికిత్సకు డాక్టర్ రమేష్ చేయూత

- రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత



నిజామాబాద్ జిల్లా / పోతంగల్, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన శ్రీహిత–కళ్యాణ్ దంపతుల 18 నెలల చిన్నారి మహాన్వీ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు రెండు ఆపరేషన్లు అవసరమని వైద్యులు సూచించగా, ప్రస్తుతం నిర్వహించాల్సిన ఆపరేషన్‌కు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో చిన్నారి చికిత్సకు అవసరమైన భారీ మొత్తాన్ని సమకూర్చుకోలేక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం గ్రామస్థులకు తెలియడంతో దాతల సహాయం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామస్థుల సూచన మేరకు సీతలే రమేష్‌ను సంప్రదించి చిన్నారి పరిస్థితిని వివరించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ రమేష్ వెంటనే స్పందించి, తన వాట్సాప్ స్టేటస్ ద్వారా విరాళాల సేకరణకు ముందుకు వచ్చారు. కేవలం రెండు రోజుల్లోనే రూ.50 వేల విరాళాన్ని సేకరించి, స్వయంగా చిన్నారి కుటుంబం ఇంటికి వెళ్లి ఆ మొత్తాన్ని అందజేశారు. అంతేకాకుండా చిన్నారి చికిత్సకు మరిన్ని మార్గాల్లో సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని డాక్టర్ రమేష్ హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న డాక్టర్ రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ చిన్నారి చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ రమేష్‌తో పాటు తమకు తోచిన విధంగా సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారి మహాన్వీ చికిత్సకు దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని హెగ్డోలి గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో దుమలే అర్జున్ పటేల్, ముప్ప రత్నాకర్, మంగలి విశ్వనాథ్, కిరణ్, సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్, సుకృత్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి

- తమ భూమిని ఇతరుల పేర్లపై పట్టా చేశారని ఆరోపణ



ములుగు జిల్లా / జేడీ మల్లంపల్లి , ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): రామచంద్రాపురం గ్రామ శివారులోని సర్వే నంబర్ 3293లో తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు తెలియకుండా ఇతరుల పేర్లపై అక్రమంగా పట్టా మార్చారని ఆరోపిస్తూ భూమ స్వామి కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా జరిగిన పట్టా మార్పిడులను రద్దు చేసి, తమ భూమిని తమ పేర్లపై పట్టా చేయాలని వారు కోరారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. బొల్లోనపల్లి గ్రామానికి చెందిన భూమ స్వామి తండ్రి భూమ లక్ష్మయ్య పేరున సర్వే నంబర్ 3293, ఖాతా నంబర్ 1517లో రెండు ఎకరాల భూమి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సదరు భూమిని తమ కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం, అనుమతి లేకుండానే భూమిలోని 1 ఎకరం 32 గుంటల భూమిని ఇతరుల పేర్లపై పట్టా మార్చినట్లు ఆరోపించారు.రామచంద్రాపురం గ్రామానికి చెందిన మార్త సదానందం, తండ్రి రాజయ్య తమ భూమిలోని 0.36 గుంటల భూమిని క్యాతం ప్రవళిక, భర్త రమేష్ పేరుపై పట్టా చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో 0.36 గుంటల భూమిని మైనింగ్ పేరుపై పట్టా చేయించినట్లు ఆరోపించారు. సదరు భూమిలో మైనింగ్ కార్యకలాపాలు సైతం నిర్వహిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు సమస్య పరిష్కారానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని, అంతేకాకుండా తమను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూమి రికార్డులను పరిశీలించాలని బాధితులు కోరారు. అక్రమంగా జరిగిన పట్టా మార్పిడులను రద్దు చేసి, తమ కుటుంబానికి చెందిన భూమిని తమ పేర్లపై నమోదు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో భూమ స్వామి, స్వరూప, జనార్దన్, చంద్రమౌళి, కవిత, ప్రవీణ్, పూల, సతీష్, మేఘ అర్జున్, సందీప్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులకు 11 వినతులు



వరంగల్/ వర్ధన్నపేట, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్ధన్నపేట మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 11 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో కార్యాలయం వెల్లడించింది. వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 8, పోలీస్ శాఖకు 2, మున్సిపాలిటీకి సంబంధించి ఒక దరఖాస్తు ఉన్నాయి. వివిధ సమస్యలతో మండలంలోని ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం ద్వారా ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతోందని అధికారులు తెలిపారు.

పురుషుల జేబులకు గండి కొడుతున్న ఆర్టీసీ

- **పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు.. రూ.45 టికెట్‌కు రూ.80 వసూలు చేస్తున్నారని ఆరోపణ**
- **బస్సులు అందుబాటులో లేవంటున్న అధికారులు.. మరి ఉచిత ప్రయాణం మాటేంటి?**





భూపాలపల్లి జిల్లా / కాటారం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భూపాలపల్లి డిపోకు చెందిన ఓ బస్సు వ్యవహారం ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. భూపాలపల్లి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు (టీజీ 25 జెడ్ 0000)కు ఎక్స్‌ప్రెస్ బోర్డు ఏర్పాటు చేసి, ధన్వాడ నుంచి మంథని వరకు సాధారణంగా రూ.45గా ఉన్న టికెట్‌కు రూ.80 వరకు వసూలు చేస్తున్నారని పురుష ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు ఎందుకు ఏర్పాటు చేశారని ప్రయాణికులు ప్రశ్నించగా.. బస్సుల కొరత కారణంగా పల్లె వెలుగు బస్సును ఎక్స్‌ప్రెస్‌గా నడపాల్సి వస్తోందని డిపో అధికారులు పేర్కొన్నట్లు ప్రయాణికులు తెలిపారు. అయితే బస్సు రకం మార్చడంతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ బస్సులు లేవంటున్నారు.. మరి ఉచిత ప్రయాణం ఎలా?

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతున్న నేపథ్యంలో బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. ఒకవైపు బస్సులు అందుబాటులో లేవని అధికారులు చెబుతుండగా, మరోవైపు ఉన్న బస్సులనే ఎక్స్‌ప్రెస్‌గా నడుపుతూ టికెట్ చార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రూ.80 చెల్లించి టికెట్ తీసుకున్న పురుష ప్రయాణికులు బస్సుల్లో నిల్చొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళా ప్రయాణికుల రద్దీ కారణంగా సీట్లు దొరకకపోవడం, బస్సుల్లో తీవ్ర రద్దీ నెలకొనడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. బస్సులు అందుబాటులో లేవని చెప్పి పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు ఏర్పాటు చేసి అధిక చార్జీలు వసూలు చేస్తే ప్రయాణికుల పరిస్థితి ఏమిటి? రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆర్టీసీపై లేదా? అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

★ ఆర్టీసీ అధికారులు స్పందించాలి

టికెట్ చార్జీల విషయంలో స్పష్టత ఇవ్వడంతో పాటు పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు ఏర్పాటు చేయడానికి గల కారణాలను టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు వెల్లడించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సుల కొరత ఉన్నట్లయితే రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, టికెట్లు కొనుగోలు చేసి ప్రయాణించే పురుష ప్రయాణికులకు కూడా మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉచిత ప్రయాణ పథకం అమలవుతున్నప్పటికీ టికెట్ చెల్లించి ప్రయాణించే వారికి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులందరికీ సముచిత మైన, సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు

అసంపూర్తి రహదారి నిర్మాణం.. నాలుగేళ్లుగా నరకయాతన!

- **కంకర పోసి వదిలేసిన అధికారులు.. గుంతలమయంగా మారిన రహదారి**
- **వాహనదారులు, విద్యార్థులకు తప్పని తిప్పలు.. వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్**



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) 65వ డివిజన్ పరిధిలోని నిరుప్‌నగర్ నుంచి సుబ్బయ్యపల్లి మీదుగా సోమిడి వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించిన అధికారులు రహదారిపై కంకర పోసి చదును చేసిన అనంతరం పనులను నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు నిలిచిపోవడంతో ప్రస్తుతం రహదారి మొత్తం గుంతలు, కంకర రాళ్లతో అధ్వానంగా మారింది. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉందని, రాత్రి వేళల్లో రహదారిపై ప్రయాణించడం మరింత ఇబ్బందికరంగా ఉంటోందని చెబుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అధ్వానంగా మారడంతో ప్రతి రోజు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

★ దుమ్ము, ధూళితో అవస్థలు

రహదారి పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో భారీగా దుమ్ము, ధూళి లేస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఇళ్లలోకి దుమ్ము చేరడంతో పాటు రహదారి వెంట నివసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఈ మార్గంలో సులభంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా రహదారి పనులు పూర్తికాకపోవడంపై అధికారుల తీరుపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

★ వెంటనే పనులు పూర్తి చేయాలి

ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులను తక్షణమే తిరిగి ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రహదారి పూర్తయితే నిరుప్‌నగర్, సుబ్బయ్యపల్లి, సోమిడి ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని వారు పేర్కొన్నారు.

మండల సమైక్య నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నిజామాబాద్ జిల్లా/ కోటగిరి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి మండల సమైక్య నూతన పాలకవర్గ సమావేశం సోమవారం కోటగిరి రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సంఘం నిర్వహించిన లావాదేవీలు, కార్యకలాపాల వివరాలను సభ్యులకు వెల్లడించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం. సుజాత, కార్యదర్శిగా వాగ్మారే భాగ్యశ్రీ, కోశాధికారిగా ఎం. గంగాలత ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు, సర్పంచ్ బర్ల మధుకర్, ఏపీఎం భాస్కర్, సీసీలు సాయిబాబా, నాగరాజు, రమేష్‌తో పాటు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 4

పేదలకు మెరుగైన కంటి వైద్యం అందించడమే లక్ష్యం

- **ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం**
- **1,500 మందికి కంటి పరీక్షలు.. 1,000 మందికి అద్దాలు.. 100 మందికి శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్‌కు తరలింపు**





వరంగల్ , ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఇసుక అడ్డ పోర్ట్ రోడ్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన మహా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 1,500 మంది పేద, మధ్యతరగతి ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు 1,000 మందికి పైగా కంటి అద్దాలు అందించినట్లు తెలిపారు. రెటీనా సమస్యలు, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన సుమారు 100 మందిని తదుపరి చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇది ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వైద్య శిబిరమని తెలిపారు. మొదటి విడతలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గలో నిర్వహించిన శిబిరానికి సుమారు 2,000 మంది హాజరైనట్లు చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రదీప్‌రావు సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన వారికి కంటి అద్దాలు, తదుపరి చికిత్సకు వైద్యుల సూచనలు అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. శిబిరానికి విశేష స్పందన అందించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా, ఆరోగ్యమే మహాభాగ్యంగా భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు మాట్లాడుతూ.. శిబిరానికి సహకరించిన శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బందికి, క్రీడో లైఫ్ సైన్స్ డైరెక్టర్ ఆలూరు వంశీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కెళ్లపల్లి రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎడ్ల అశోక్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, డాక్టర్ కాళీ ప్రసాద్, పుల్లారావు, బీజేపీ కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, గుజ్జుల వసంత మహేందర్, కార్యక్రమ నిర్వాహకులు మంద శ్రీనివాస్, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గోదా రంగనాయక స్వామి సన్నిధిలో మనవడి అన్నప్రాశన వేడుక

- భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించిన కొడారి మల్లేష్ యాదవ్ కుటుంబం



పెద్దపల్లి జిల్లా / ముత్తారం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. అందులో కుటుంబంలో కొత్తగా అడుగుపెట్టిన చిన్నారి తొలిసారిగా అన్నం స్వీకరించే అన్నప్రాశన వేడుక ప్రతి కుటుంబానికి అపురూపమైన, ఆనందకరమైన సందర్భం. అలాంటి మధురమైన వేడుకను పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన కొడారి మల్లేష్ యాదవ్ కుటుంబ సభ్యులు సోమవారం రామగిరి మండలం లద్దునూర్‌లోని శ్రీ గోదా రంగనాయక స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు చిన్నారికి సంప్రదాయ బద్ధంగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి తొలిసారిగా అన్నం స్వీకరించిన మధుర క్షణాలతో కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రీ గోదా రంగనాయక స్వామివారిని ప్రార్థించారు. ఈ శుభకార్యంలో చిన్నారి తల్లి తొట్ల రమ్యశ్రీ, తండ్రి సంపత్ ప్రేమాభిమానాలతో కుమారుడికి అన్నప్రాశన చేయించారు. చిన్నారి తాత కొడారి మల్లేష్ యాదవ్, అమ్మమ్మ రాజమణి, మేనమామ రక్షిత్ కుమార్‌తో పాటు అబ్బాయి తరఫు తల్లిదండ్రులు తొట్ల బంగారక్క, రాజయ్య, పెద్దనాన్న రవి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. స్వామివారి సన్నిధిలో జరిగిన ఈ వేడుక ఆధ్యాత్మిక వాతావరణంలో కుటుంబ సభ్యులకు చిరస్మరణీయమైన మధుర జ్ఞాపకంగా నిలిచింది.

భూ రీ-సర్వే వివరాల నమోదులో

లోటుపాట్లకు తావివ్వొద్దు

- **ప్రతి హక్కుదారుడి వివరాలు, విస్తీర్ణం పక్కాగా నమోదు చేయాలి**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):హనుమకొండ జిల్లాలోని 70 గ్రామాల్లో ప్రాధాన్యతతో చేపట్టిన భూ రీ-సర్వే సమాచారాన్ని సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక, ఇతర లోటుపాట్లకు తావివ్వకుండా పక్కాగా నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రీ-సర్వే ప్రగతితో పాటు డిజిటల్ రికార్డుల నమోదు ప్రక్రియను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రత్యేకంగా ల్యాండ్ పార్సల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు), రైతుల వారీగా రూపొందించిన పాలిగన్ మ్యాపుల డిజిటైజేషన్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా భూ రీ-సర్వే ప్రక్రియను ఐదు దశల్లో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో రైతులకు భూ వివాదాలు తలెత్తకుండా ఉండేందుకే భూ రీ-సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి హక్కుదారుడి వివరాలు, భూమి విస్తీర్ణం, ఇతర సంబంధిత సమాచారాన్ని సాఫ్ట్‌వేర్‌లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తూ రికార్డుల నమోదులో పూర్తి కచ్చితత్వం పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రీ-సర్వే ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం నిరసనను విజయవంతం చేయాలి

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి - తెలంగాణ ఉద్యోగుల జేఏసీ



వరంగల్, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట, అలాగే అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రంజిత్, చినూరి యాదగిరి, సుమన్ జిత్ర, విజయ్‌చందర్, పెన్షనర్ల సంఘం నాయకులు పాకాల చంద్రశేఖర్, గాజే లక్ష్మీనారాయణ, జక్కం దామోదర్, గాజే సుధాకర్‌రావు, కుమ్మరి మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై రామగుండంలో

బీజేపీ సమరభేరి

- **నాలుగు రోజుల పాటు నిరసనలు..**
- **ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తాం**



పెద్దపల్లి జిల్లా / రామగుండం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రామగుండం నియోజకవర్గంలో బీజేపీ సోమవారం 'సమరభేరి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. గోదావరిఖని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించడంలో విఫలమైందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్ల పాలనలో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు హామీల అమలును విస్మరిస్తోందని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా కీలకంగా భాగస్వామిగా ఉందని సోమారపు లావణ్య తెలిపారు. అమృత్ పథకం కింద రామగుండానికి వందల కోట్ల రూపాయల నిధులు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ఎన్నికల హామీల అమలు తీరును ప్రజలకు వివరించేందుకు నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ మాట్లాడుతూ రామగుండంలో అభివృద్ధి పేరుతో కూల్చివేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి చేయడం చేతకాక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మామిడి రాజేష్, మాతంగి రేణుక, నరహరి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 5

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కుల వివక్షను అరికట్టాలి.. లేదంటే పోరాటమే

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలను అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆల్ సంఘాల ఐక్య వేదిక ఆగ్రహం
- అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):
పెద్దపల్లి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కుల వివక్ష కొనసాగుతున్నా జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆల్ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలు, సూచనలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కులాన్ని బట్టి న్యాయం జరిగే పరిస్థితులు నెలకొనడం రాజ్యాంగం కల్పించిన హక్కులకు, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. పంచాయతీరాజ్‌తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు.

★ అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వద్దు
ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసినప్పటికీ సకాలంలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదని, కేసులు నమోదైన తర్వాత వాటిని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అట్రాసిటీ కేసుల్లో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకున్నప్పుడే కుల వివక్ష, దాడులకు అడ్డుకట్ట వేయగలమని అన్నారు. జూలై 18న నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ రివ్యూ సమావేశంలో బాధితులు సమర్పించిన పలు దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. కమిషన్ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు.

★ నిట్టూరు పాఠశాల ఘటనపై విచారణకు డిమాండ్
నిట్టూరు పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రాఘవాపూర్ గ్రామ కార్యదర్శి టి. రవీందర్‌కు మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. అకారణంగా సస్పెన్షన్‌కు గురైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వ్యవహారాలపై తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అట్రాసిటీ కేసుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ఆల్ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. తొలుత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆందోళనలు చేపడతామని, అవసరమైతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, పెద్దపల్లి మాజీ ప్రజాప్రతినిధి కుక్క అశోక్‌తో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బుట్టాయిగూడెంలో పాలంబడి కార్యక్రమం

-మిరప నారు మడుల్లో వేరుకుళ్లు, నారు కుళ్లు తెగుళ్లపై రైతులకు అవగాహన



ములుగు జిల్లా/ కన్నాయిగూడెం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహేష్ మాట్లాడుతూ.. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు తమ పొలాల్లోనే శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా, ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటలను పరిశీలిస్తూ వాటిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి నివారణకు అవసరమైన యాజమాన్య పద్ధతులను అక్కడికక్కడే తెలుసుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా మిరప నారు మడుల్లో వేరుకుళ్లు, నారు కుళ్లు తెగుళ్లు కనిపిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వీటి నివారణకు ట్రైకోడెర్మా విరిడీ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రాములను లీటర్ నీటికి కలిపి, నారు మడులు తడిచే విధంగా తగిన యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామ రైతులు మోహన్, పోలయ్య, సమ్మయ్య, బైరేష్ తదితరులతో కలిసి మిరప నారు మడులను పరిశీలించారు. తెగుళ్ల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం, పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నారు మడుల్లో తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ రైతులకు సూచించారు.

చతుర్థి పూజలందుకున్న గణనాథుడు

- సంకటాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం
- శ్రావణ సంకష్టహర చతుర్థికి విశేష ప్రాధాన్యం



పెద్దపల్లి జిల్లా / మంథని, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):శ్రావణ మాసంలో వచ్చిన సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని మంథని పట్టణంలోని శ్రీ మహాగణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువైన గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టి శ్రీ విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే జీవితంలో ఎదురయ్యే కష్టాలు, విఘ్నాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయంలో ప్రదక్షిణలు చేసి మోదకాలు, ఉండ్రాళ్లు తదితర నైవేద్యాలను సమర్పించారు. ప్రతి నెల పౌర్ణమి అనంతరం వచ్చే చవితి తిథిని సంకష్టహర చతుర్థిగా ఆచరిస్తారు. ఈ రోజున ఉపవాసం ఉండి చంద్రోదయం అనంతరం స్వామివారిని పూజించి భోజనం చేయడం దీక్షలో ప్రధానమైన ఆచారంగా భావిస్తారు. గణపతికి ఇష్టమైన గరిక (దూర్వాలు) సమర్పించడం, ఉండ్రాళ్లు నైవేద్యంగా పెట్టడం ద్వారా స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. అలాగే ‘‘ఓం గం గణపతయే నమః’’ మంత్రాన్ని స్మరిస్తూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుంటే కష్టాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీ మహాగణపతి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అర్చకులు పల్లి రాము ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి పట్టాలు ఇవ్వాలి

- పేదల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):నగరంలో గుడిసెలు వేసుకుని ఏళ్ల తరబడి నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పేదల సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు స్థిరమైన నివాస హక్కు కల్పించాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు నివసిస్తున్న కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు తదితర మౌలిక వసతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పేర్లు నమోదు కాని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వారికి కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి పట్టాలు, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రభుత్వం స్పందించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

మంథని అభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి

- రూ.9 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు..
  రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు
- మౌలిక వసతుల అభివృద్ధితో మారనున్న పట్టణ రూపురేఖలు





పెద్దపల్లి జిల్లా / మంథని, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):
మంథని పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వినాయక టెంపుల్ నుంచి ఎరుకలగూడెం వరకు, వినాయక టెంపుల్ నుంచి తమ్మిచెరువు కట్ట వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. మంథని పట్టణంలోని వివిధ వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.9 కోట్ల నిధులు కేటాయించగా, ఆగస్టు 19న పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా బ్రిడ్జి రోడ్డు నుంచి బస్ డిపో వరకు రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులకు సుమారు రూ.15 కోట్లతో చర్యలు ప్రారంభించారు. గాంధీచౌక్–అంబేద్కర్ చౌక్ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, అంబేద్కర్ చౌక్–ముత్యాలమ్మ ఆలయం వరకు రోడ్డు విస్తరణ, క్యాంప్ ఆఫీస్ రోడ్డు అభివృద్ధి పనులకు సైతం నిధులు కేటాయించారు.

★ రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు
మంథని నియోజకవర్గంలో గత రెండున్నరేళ్లలో సుమారు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు ఆగస్టు 19న జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఇతర మంత్రులు వెల్లడించారు. ఇటీవల రూ.164 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. మంథని డిపో నుంచి డిగ్రీ కళాశాల వరకు రహదారి అభివృద్ధికి రూ.21 కోట్లు కేటాయించారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.5.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనుల పరిశీలన, వినాయక టెంపుల్ నుంచి ఎరుకలగూడెం, వినాయక టెంపుల్ నుంచి తమ్మిచెరువు కట్ట మార్గాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సోమవారం పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తయితే మంథని పట్టణ రూపురేఖలు మారనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 6

22ఏ జీవోను రద్దు చేయాలి.. ప్రజల భూములను కాపాడాలి

- సిద్ధిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ మహాధర్నా
- ఎల్కతుర్తి మండల బీజేపీ నాయకుల పాల్గొనడం



హన్మకొండ/ ఎల్కతుర్తి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 22ఏ జీవోను రద్దు చేయాలని, ప్రజలు, రైతుల భూముల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట జిల్లా ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం భారీ మహాధర్నా నిర్వహించారు. ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 22ఏ జీవో కారణంగా ప్రజలు, రైతులు తమ భూములకు సంబంధించిన హక్కుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజల భూముల హక్కులను పరిరక్షించేందుకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు, రైతుల భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 22ఏ జీవోను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. మహాధర్నాలో ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుడితాడు చిరంజీవి, మధుకర్‌రావు, షణ్ముఖ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి సంపత్‌రావు, పెరుగు మధు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ శ్యాంసింగ్, మండల కోశాధికారి హింగే దేవరావు, సోషల్ మీడియా కన్వీనర్ పోల్ శివతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల హక్కులు, రైతుల భూములను పరిరక్షించే వరకు 22ఏ జీవోకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

గోపాల్పూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలు ఏర్పాటు

- గ్రామ శాఖల అధ్యక్షులుగా నామిండ్ల నరేష్, మంద అనిల్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



హన్మకొండ/ ఎల్కతుర్తి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను సోమవారం ఏర్పాటు చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎంఎస్పీ అధ్యక్షుడు కొయ్యడ రాజేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి జూపాక మధుకర్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి ఎల్తూరి వినయ్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నామిండ్ల నరేష్, ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మంద అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడిగా వై. రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్తూరి అజయ్‌ను ఎంపిక చేశారు. అలాగే జూపాక సుమన్, నామిండ్ల శివకృష్ణ, కొయ్యడ ప్రవీణ్‌కుమార్, జూపాక రాహుల్, మారేపల్లి దిలీప్, పవన్, చరణ్, రాజు తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం



భూపాలపల్లి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ.. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు.

సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

- హనుమకొండలో ఘనంగా సంచార జాతుల విముక్తి ఉత్సవం



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):సంచార జాతులకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జె. రంగారెడ్డి ఆధ్వర్యంలో సంచార జాతుల విముక్తి ఉత్సవాన్ని సోమవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ప్రత్యేకంగా గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, సంచార జాతుల ప్రతినిధులు ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. లక్ష్మణ్, ఆర్. సంపూర్ణ, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

- సుదీర్ఘకాలం అందించిన సేవలు అభినందనీయం: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్





భూపాలపల్లి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పదవీ విరమణ పొందుతున్న వారిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్సై-2 ఎస్. ఈశ్వరయ్య, ఘణపురం పోలీస్ స్టేషన్ ఎస్సై-2 ఎన్. సత్యనారాయణరావు, భూపాలపల్లి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్సై పి. రవికుమార్, ఎస్బీకి చెందిన ఏఎస్సై సిహెచ్. కుమారస్వామి, పీసీఆర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి. అశోక్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అని అన్నారు. ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగి విజయవంతంగా విధులు నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది పోలీసు శాఖకు అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని, వారి అనుభవాలు శాఖకు ఎంతో విలువైనవని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, భూపాలపల్లి సీఐ శ్రీనివాస్, పోలీసు సంఘం అధ్యక్షుడు నరేష్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

-రైతులకు భూదార్ కార్డుల పంపిణీ



మహబూబాబాద్ జిల్లా / కేసముద్రం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళీనాయక్, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బానోతు సునీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం రైతులకు భూదార్ కార్డులను మంత్రులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. భూ రికార్డుల నిర్వహణ, రైతులకు భూమికి సంబంధించిన వివరాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో భూదార్ కార్డులు ఉపయోగపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 7

హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష

- సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క





మహబూబాబాద్, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):మహబూబాబాద్ కలెక్టరేట్‌లో హౌసింగ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశానికి హాజరై సంబంధిత అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్‌తో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు. హౌసింగ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి, ఆయా జిల్లాల్లో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ పరిపాలన తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

వేయి స్తంభాల ఆలయంలో ఎమ్మెల్యే నాయిని దంపతుల ప్రత్యేక పూజలు

-సంకట చతుర్థి సందర్భంగా ఉద్దిష్ట గణపతికి అభిషేకం





హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): శ్రావణ బహుళ తృతీయ సోమవారం, సంకట చతుర్థి సందర్భంగా చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ ముహూర్తంలో నిర్వహించిన సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్దిష్ట గణపతికి ఆవుపాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ గణనాథునికి ప్రత్యేక పూజలు, నీరాజనం, మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం శివునికి ప్రీతికరమైన సోమవారం సందర్భంగా రుద్రాభిషేకం, రుద్రాధ్యాయం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నాట్య మండపంలో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

★ ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే హర్షం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంబంధిత శాఖల సహకారంతో వేయి స్తంభాల దేవాలయం దినదినాభివృద్ధి చెందుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, గార్డెన్ పూర్తయితే పచ్చని చెట్ల మధ్య భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరే అవకాశం ఉంటుందని తెలిపారు. గార్డెన్ నిర్వహణను కూడా నిరంతరం మెరుగ్గా చేపట్టాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. తృతీయ సోమవారం సందర్భంగా శివభక్తులు, దాతల సహకారంతో పేద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుద్ర సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

- **42 ఏళ్ల సుదీర్ఘ సేవలు అభినందనీయం**
- **పోలీసు శాఖకు వారి సేవలు చిరస్మరణీయం**



ములుగు జిల్లా , ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐలు సారమల్లు, ఇమ్మాన్యుయేల్‌కు ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సదానందం వారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ సారమల్లు, ములుగు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ ఇమ్మాన్యుయేల్ 42 సంవత్సరాల సుదీర్ఘ సేవ అనంతరం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ములుగు సీఐ సురేష్ మాట్లాడుతూ.. 42 ఏళ్ల పాటు పోలీస్ శాఖకు సేవలందించిన ఇద్దరు అధికారులు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వారికి ఎలాంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. ఆర్ఐ స్వామి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ ప్రతి ఒక్కరి జీవితంలో తప్పనిసరి దశ అని అన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ములుగు జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి సంఘం కట్టుబడి ఉందన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులకు రావాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ములుగు డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ.. 42 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఇద్దరు అధికారులు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని విధులు నిర్వర్తించారని కొనియాడారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో సైతం ఎంతో కష్టపడి విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ అభివృద్ధికి కృషి చేశారని ప్రశంసించారు. వారి సేవలు పోలీస్ శాఖకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అధికారులకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ అనంతరం కూడా కుటుంబ సభ్యులు వారికి అదే విధంగా సహకారం అందించాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీ సదానందం మాట్లాడుతూ.. ఎస్ఐలు సారమల్లు, ఇమ్మాన్యుయేల్ పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి ఉన్నతాధికారులు, సహచరుల మన్ననలు పొందారని అన్నారు. సుదీర్ఘకాలం సేవలందించిన పదవీ విరమణ పొందిన సిబ్బంది సేవలను పోలీస్ శాఖ ఎప్పటికీ మరువదని తెలిపారు. పోలీసు రిటైర్‌మెంట్ కేవలం వారి వృత్తికే.. వారి వ్యక్తిత్వానికి కాదు అని పేర్కొన్న ఆయన, పోలీసు కుటుంబంలో ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చని తెలిపారు. పగలు, రాత్రి, పండుగలు అనే తేడా లేకుండా కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, ములుగు సీఐ సురేష్, ఆర్ఐలు స్వామి, వెంకటనారాయణ, ములుగు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రాంతి, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచర సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- ఎమ్మెల్యే నాయిని

- **బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలకు ఆధారాల్లేవు**
- **ప్రజలు వాస్తవాలు గమనించాలిపదేళ్లలో చేయనిది కాంగ్రెస్ రెండున్నరేళ్లలో చేసి చూపించింది**



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ అభివృద్ధిపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలకు ఆధారాలు లేవని, వాస్తవాలతో చర్చకు రావాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ చేశారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే రాజకీయ అజెండాగా పెట్టుకున్న కొందరు నేతలు విషయం తెలియకుండా ఆరోపణలు చేస్తున్నారని నాయిని విమర్శించారు. రాజకీయ విమర్శలు చేయాలంటే ఆధారాలు, వాస్తవాలతో మాట్లాడాలని సూచించారు. గత ప్రభుత్వాల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.

★ వరంగల్ అభివృద్ధికి భారీ నిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ అభివృద్ధికి పెద్దపీట వేసిందని నాయిని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సుమారు రూ.5,300 కోట్లు, శాశ్వత తాగునీటి వసతుల కోసం రూ.550 కోట్లకు పైగా నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని, నిజాం కాలం నాటి ఫిల్టర్ బెడ్ల స్థానంలో ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అంశంపై గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతులు, భూసేకరణకు చర్యలు తీసుకుంటూ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి ముందుకు సాగుతోందన్నారు. రింగ్‌రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల కోసం కూడా నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు.

★ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణకు చర్యలు చేపట్టడంతో పాటు విభజన చట్టంలో ఉన్న హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాజీపేట, వరంగల్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. గత పదేళ్లలో వారు చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిని ప్రజల ముందే చర్చిద్దామని అన్నారు.

★ సీజనల్ రాజకీయాలను నమ్మొద్దు

కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు నేతలు ప్రజల్లోకి వచ్చి రాజకీయాలు చేస్తున్నారని నాయిని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్యకు వచ్చే సీజనల్ రాజకీయ నాయకులను ప్రజలు నమ్మవద్దని కోరారు. గత పదేళ్ల పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. తమ కళ్లముందు జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, ఆధారాలు లేని ఆరోపణలను నమ్మవద్దని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 8

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

ప్రమాదాల నివారణకు తాడ్వాయి పోలీసుల ముమ్మర తనిఖీలు

- **డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా**
- **అనుమానం వస్తే వాహన దారులకు కౌన్సెలింగ్**



ములుగు జిల్లా/ తాడ్వాయి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు తాడ్వాయి పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. తాడ్వాయి మండలంలోని మేడారం టోల్‌గేట్ వద్ద ఎస్ఐ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. తాడ్వాయి–పస్రా మధ్య ఇసుక లారీల రాకపోకలు అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వాహనం నడుపుతున్న డ్రైవర్ పరిస్థితిని పరిశీలించిన అనంతరం మాత్రమే వాహనాలను ముందుకు పంపిస్తున్నారు. డ్రైవర్ మద్యం సేవించినట్లు అనుమానం వచ్చినా, ఇతర అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత చర్యలు తీసుకుంటున్నారు.

★ అక్రమ రవాణాపైనా ప్రత్యేక నిఘా

డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు నిషేధిత మత్తు పదార్థాల రవాణా, పశువులను అక్రమంగా కబేళాలకు తరలించడం వంటి కార్యకలాపాలపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు. అయితే పోలీసులు పటిష్టంగా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు దళారులు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలను పూర్తిగా అరికట్టాలంటే ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటిని అరికట్టేందుకు మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రజల సహకారంతోనే అక్రమ దందాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులు సూచిస్తున్నారు

ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు

- **వెయ్యి రోజులు గడిచినా హామీల అమలు శూన్యం**
- **సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ నిరసనలు**



వరంగల్/ వర్ధన్నపేట, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాలతో సోమవారం వర్ధన్నపేట మండల, పట్టణ బీఆర్ఎస్ కమిటీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది రోజులపాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వర్ధన్నపేటలో వివిధ వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలను విజయవంతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ సర్పంచ్ గుజ సంపత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గుజ వీరన్న, సిల్వర్ కుమార్‌స్వామి, బానోత్ నవీన్, సింగారబోయిన రాజశేఖర్, తుమ్మల శ్రీధర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య తిరుపతి, మాజీ కౌన్సిలర్ పూజారి రఘు, ఎండీ రహీం, మార్తా సారంగపాణి, కొండేటి సంపత్, ఎలుకట్టే యాకయ్య, భూక్య రామన్న, భూక్య సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌తో ఎరువుల బుకింగ్ ఈజీ

- నమోదు చేసుకున్న 48 గంటల్లోనే ఎరువులు.. అన్ని కేటగిరీల రైతులకు అవకాశం

పెద్దపల్లి జిల్లా / మంథని, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సులభతరం చేసేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంథని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ దాసరి నవ్య సూచించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన ఎరువులను ముందుగానే నమోదు చేసుకోవచ్చని, నమోదు అనంతరం 48 గంటల్లో ఎరువులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టాదారు రైతులతో పాటు మరణించిన పట్టాదారుల వారసత్వం నమోదు కాని భూములను సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు, అటవీ హక్కుల పట్టాలు కలిగిన వారు, పోడు భూములు, దేవాదాయ శాఖ భూములు, ప్రభుత్వ, సంస్థలు, సామాజిక భూములు సాగు చేస్తున్న రైతులు కూడా ఈ విధానం ద్వారా ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఆధార్, ఫోన్ నంబర్ ధ్రువీకరణ అనంతరం భూమి వివరాలను నమోదు చేసే సమయంలో సంబంధిత కేటగిరీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి ఉన్న రైతులు, చట్టపరమైన వారసులు, భూమి యజమానులుగా ఉండి వివరాలు ఇంకా రెవెన్యూ రికార్డుల్లో నవీకరించబడని వారు కూడా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. భూమి వివరాలు నమోదు కాని రైతులు యాప్‌లోని 'భూమిని జోడించు' ఎంపిక ద్వారా సాగు చేస్తున్న భూమి సర్వే నంబర్, విస్తీర్ణాన్ని నమోదు చేయాలని సూచించారు. అనంతరం సంబంధిత వ్యవసాయ అధికారి పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాత ఎరువులను బుక్ చేసుకుని పొందవచ్చన్నారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నమోదు చేసుకోవడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల విక్రయదారులు సహకరిస్తారని తెలిపారు. జిల్లాలో ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, రైతులు ఎరువుల లభ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ దాసరి నవ్య స్పష్టం చేశారు.



ఉయిక శిరీషకు న్యాయం చేయాలి

- చెరుకూరు సెంటర్‌లో ఆదివాసీ నవ నిర్మాణ సేన కొవ్వొత్తుల ర్యాలీ



ములుగు జిల్లా/ వాజేడు, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఉయిక శిరీష హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపై ఆదివాసీ నవ నిర్మాణ సేన తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వాజేడు మండలం చెరుకూరు సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆదివాసీ యువత, గ్రామస్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొవ్వొత్తులు చేతబట్టి ఉయిక శిరీషకు నివాళులర్పించారు. అనంతరం చెరుకూరు సెంటర్‌లో ఐదు నిమిషాల పాటు మౌనం పాటించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శిరీష మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉయిక శిరీష మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో మా పోరాటం కొనసాగుతుంది అని ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు స్పష్టం చేశారు.

ఆదివాసీ ఆడబిడ్డకు న్యాయం జరిగే వరకు పోరాడుదాం

- **ఉయిక శిరీష ఘటనపై గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆగ్రహం**
- **నిందితులను కఠినంగా శిక్షించాలి**
  - **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి**



ములుగు జిల్లా/ వాజేడు, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఘటనకు బాధ్యులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. సోమవారం వాజేడు మండల కేంద్రం నుంచి సోషల్ మీడియా వేదికగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివాసీ మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం పాలన సాగిస్తున్నప్పటికీ ఆదివాసీ మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉయిక శిరీష ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళపై ఇంతటి దారుణం జరిగినప్పటికీ ఆదివాసీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని పూనెం సాయి ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో మహిళలపై జరిగిన నేరాల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించిన సందర్భాలను ప్రస్తావిస్తూ.. ఉయిక శిరీష ఘటనలోనూ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పూనెం సాయి పిలుపునిచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543
Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 9

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

21 ఏళ్ల ప్రస్థానం.. ఆర్టీసీ బస్సుతో కోటగిరి మహిళా సమాఖ్య ప్రగతి

- 100 శాతం రికవరీ, సైబర్ అవగాహన, డిజిటల్ బుక్ కీపింగ్‌పై కీలక తీర్మానాలు

నిజామాబాద్ జిల్లా / కోటగిరి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):
నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి మండల మహిళా సమాఖ్య 21వ వార్షిక మహాజనసభ సోమవారం సవరించిన బైలా ప్రకారం పలు చర్చలు, తీర్మానాల మధ్య కొనసాగింది. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం. సుజాత అధ్యక్షతన, ఏపీఎం జి. భాస్కర్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామ సంఘాల నుంచి అధ్యక్షురాలు, కార్యదర్శి చొప్పున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం. సుజాత, ఏపీఎం జి. భాస్కర్ మాట్లాడుతూ.. కోటగిరి మండల సమాఖ్య 21 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. సమాఖ్య ఆడిట్ నివేదికకు ఆమోదం తెలిపినట్లు, 2026–27 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. సంఘాల ద్వారా ఇచ్చిన రుణాల రికవరీని 100 శాతానికి తీసుకెళ్లడంతో పాటు, ఇప్పటివరకు మహిళా సంఘాల్లో చేరని నిరుపేద మహిళలను గుర్తించి సంఘాల్లోకి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.



శాతం మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంచు తూ, మిగతా 50 శాతాన్ని సమాఖ్య కార్యక్రమాల నిర్వహణకు వినియోగిస్తున్నట్లు వివరించారు.

★ సైబర్ నేరాలపై అవగాహన

మహిళలు సైబర్ నేరాల బారిన పడకుండా మండలవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహాజనసభలో తీర్మానించారు. మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించేలా డిజిటలైజేషన్, డిజిటల్ బుక్‌కీపింగ్ విధానాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలు, శిక్షణ, నిర్వహణ ఖర్చులు తదితరాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం సమాఖ్యకు రూ.1.81 లక్షల లాభం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్, ఎంపీడీవో జి. విష్ణు, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి భాగ్యశ్రీ, కార్యవర్గ సభ్యులు, సీసీలు సాయిబాబా, నాగరాజు, రమేష్, నాగలక్ష్మి , సుజాత, అకౌంటెంట్ రాజు, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, వివోఏలు, ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చెరుకూరు గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన గ్రామస్తులు
- తాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై అధికారులకు విజ్ఞప్తి

ములుగు జిల్లా / వాజేడు, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : వాజేడు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెరుకూరు, రేగుల పాడు, మోతుకూలగూడెం, బయ్యారం కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గ్రామస్తులు, ఆదివాసీ నాయకులు కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీరు, బోరు పంపులు, డ్రైనేజీ, మురుగు కాల్వలు, పారిశుద్ధ్యం, విద్యుత్ భద్రత తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. చెరుకూరు గ్రామంలో గత మూడు నెలలుగా పనిచేయని వీధిలైట్లను వెంటనే మరమ్మతు చేసి పునరుద్ధరించాలని, మోతుకూలగూడెం వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పాడైన బోరు పంపులను గుర్తించి మరమ్మతులు చేయాలని కోరారు. అలాగే శ్రీరామ ఫెర్టిలైజర్ షాప్ నుంచి వెళ్లే సీసీ రోడ్డు చివర డ్రైనేజీ తూము ఏర్పాటు చేయాలని, చెరుకూరు సెంటర్‌లోని పాఠశాల ముందు నిలిచే మురుగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మురుగు కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు చెత్తను తొలగించి, ప్రతి వార్డులో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని విజ్ఞప్తి చేశారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావులను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



★ ఆదివాసీ నాయకుల పాల్గొనడం

ప్రజావాణి కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఎట్టి విద్యాసాగర్, మోడెం నాగరాజు, పాయం జానకిరావు, వాసం సంతోష్‌కుమార్ పాల్గొని గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు పాయం అంజనేయులు, యాలం ఆదిత్య, పీర్ల రాంబాబు, కోరం మనోజ్‌కుమార్, పీర్ల రవిరాజు, యాలం అశోక్, వాసం ఈశ్వర రావు, వాసం నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రామ సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించి, అత్యవసర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. చెరుకూరు గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.



మేరా యువ భారత్ వాలంటీర్‌గా సందీప్ ఎంపిక

జనగామ జిల్లా / పాలకుర్తి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ పరిధిలోని 'మేరా యువ భారత్' (MY Bharat) సంస్థ జాతీయ యువజన దళం (NYC) పథకం కింద జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎలమకంటి సందీప్ వాలంటీర్‌గా ఎంపికయ్యారు. పాలకుర్తి, దేవరుప్పుల బ్లాక్‌లకు వాలంటీర్‌గా ఆయనను ఎంపిక చేస్తూ వరంగల్ జిల్లా యువజన అధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దేశ నిర్మాణంలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని సందీప్ తెలిపారు. 'వికసిత్ భారత్' సాధనలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. యువతీ యువకులు MY Bharat పోర్టల్‌లో సభ్యులుగా నమోదు చేసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. తన ఎంపికకు సహకరించిన DYO సంజీవ్, అకౌంటెంట్ దేవీలాల్, DG నామినీస్ రజిత, నాగార్జునలకు సందీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. MY Bharat యువ వాలంటీర్‌గా ఎంపికైన ఎలమకంటి సందీప్‌ను గ్రామస్తులు, యువత, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.



నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి నిరుపేదలకు అందించాలి

నిజామాబాద్ జిల్లా / కోటగిరి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): కోటగిరి మండల కేంద్రంలో మధ్యలోనే నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఏ. విట్టల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోటగిరి ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విట్టల్ గౌడ్ మాట్లాడుతూ.. కోటగిరి మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గత ప్రభుత్వ హయాంలో 2023లో రూ.6.40 కోట్ల అంచనా వ్యయంతో 120 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిధుల కొరత కారణంగా పనులను మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారని ఆరోపించారు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల ఆశలు నెరవేరకుండా పోయాయని అన్నారు. ప్రజాధనంతో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇళ్లు, స్థలాలు లేక అనేక మంది పేదలు అద్దె ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకుని నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయించి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని విట్టల్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు నల్ల గంగాధర్, రవి, సాయిలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి ప్రజలకు రూ.1.05 కోట్ల సీఎం సహాయనిధి చెక్కులు

- 262 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

జనగామ జిల్లా / పాలకుర్తి, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : పాలకుర్తి నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన మొత్తం 262 మంది లబ్ధిదారులకు రూ.1,05,54,100 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్య చికిత్స కోసం అప్పులపాలు కాకుండా ఆర్థికంగా ఆదుకోవడమే సీఎం సహాయనిధి ప్రధాన ఉద్దేశమన్నారు. ఖరీదైన వైద్య చికిత్స అవసరమైన కుటుంబాలకు ఈ పథకం ఎంతో భరోసాగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అర్హులైన బాధితులకు సీఎం సహాయనిధి త్వరగా అందేలా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయిస్తున్నట్లు వివరించారు. చికిత్స ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా తమ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటు లభించిందని ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



లక్కమారికాపు పరపతి సంఘం అధ్యక్షుడిగా పెండ్లి పురుషోత్తం రెడ్డి

వరంగల్ / సంగెం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామంలోని సీతారామ లక్కమారికాపు పరపతి సంఘం 2వ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పెండ్లి పురుషోత్తం రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కడుదూరి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల సంపత్, కోశాధికారిగా సింగిరెడ్డి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా కొనుకటి బాలరాజు, గూడ రవిసాగర్, గోనె వీరభద్రయ్య, ఎరుకల రాజమౌళి, ముస్కు రాజు, కూస రాజు, ఏడాకుల శ్రీనివాస్, పెంతల స్వామి, అనుముల రాజు, పెండ్లి రవికుమార్, యార మల్లయ్య, అనుముల యుగేందర్, పొన్నాల హరీష్, కడుదూరి రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి సహకరించిన కుల పెద్దలు, పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పాలకవర్గంతో సమన్వయం చేసుకుని సంఘ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 10

రోడ్లపై పశువుల స్వైర విహారం.. వాహనదారులకు ఇక్కట్లు

- గోవులను రోడ్లపై వదిలేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలి: రాష్ట్రీయ హిందూ పరిషత్

పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాలు, వ్యాపార ప్రాంతాల్లో గోవులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్రీయ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్ తెలిపారు. కొంతమంది పశువుల యజమానులు గోవులను కట్టడి చేయకుండా రోడ్లపైకి వదిలేస్తుండటంతో అవి గుంపులుగా రహదారులపై తిరగడం, రోడ్డు మధ్యలో పడుకోవడం జరుగుతోందన్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారులపై పడుకున్న గోవులు వాహనదారులకు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పశువులను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రజలు, మూగజీవాలు గాయపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై సంచరిస్తున్న పశువుల సమస్యపై అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, పశువుల యజమానులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జాపతి రాజేష్ పటేల్ కోరారు. పట్టుబడిన పశువులను సురక్షితంగా పశు సంరక్షణ కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రధాన రహదారులు, చౌరస్తాలు, ప్రమాదకర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో పశువుల కారణంగా జరిగిన ప్రమాదాలను పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ తరపున సోమవారం విజ్ఞప్తి చేశారు.



100 సభ్యత్వాలు పూర్తి చేసి సత్తా చాటిన గరిగె సుమతి

- వరంగల్‌లో మహిళా నాయకత్వానికి స్ఫూర్తిగా నిలిచిన జిల్లా మహిళా అధ్యక్షురాలు

వరంగల్, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ రాజ్యాధికార పార్టీని వరంగల్ జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గరిగె సుమతి 100 మంది సభ్యత్వాలను పూర్తి చేసి తన నాయకత్వ పటిమను చాటుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో 100 మంది సభ్యత్వాలతో కూడిన సభ్యత్వ పుస్తకాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్‌లకు గరిగె సుమతి అందజేశారు. 100 మంది సభ్యత్వాలను విజయవంతంగా పూర్తి చేసిన గరిగె సుమతిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఘనంగా సన్మానించి అభినందించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె చూపిన చొరవ, అంకితభావం, కృషిని ఆయన ప్రశంసించారు. పార్టీ బలోపేతం కోసం స్వయంగా ముందుండి 100 మంది కొత్త సభ్యులను పార్టీలోకి చేర్చడం ద్వారా గరిగె సుమతి వరంగల్ జిల్లాలో మహిళా నాయకత్వానికి స్ఫూర్తిగా నిలిచారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆమె సాధించిన ఈ విజయంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. రాబోయే రోజుల్లోనూ ఇదే ఉత్సాహంతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల సంపత్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షురాలు రాచర్ల రచన, జిల్లా కార్యదర్శి కుచన సునీత, 19వ డివిజన్ అధ్యక్షురాలు దాసరి శ్రీదేవి, పార్టీ కార్యకర్తలు






ఉమ, సంధ్య, శ్రావంతి తదితరులు పాల్గొని గరిగె సుమతిని అభినందించారు.

హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి మరిచిపోయారా?

- మూడేళ్లుగా విద్యుత్ కనెక్షన్ లేక.. చీకట్లో సంగం వాగు కూడలి

వరంగల్/ వర్ధన్నపేట, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు మూడేళ్లుగా నిరుపయోగంగా మారాయి. పట్టణం నుంచి అన్నారం వైపు వెళ్లే ప్రధాన మార్గంలోని సంగం వాగు కూడలిలో సుమారు మూడు సంవత్సరాల క్రితం హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లైట్లు ఏర్పాటు చేసి వదిలేయడంతో రాత్రివేళ సంగం వాగు కూడలి పూర్తిగా చీకటిమయంగా మారుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కూడలి వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు వెలగకపోవడంతో ప్రస్తుతం అవి అలంకారప్రాయంగా మారాయని స్థానికులు అంటున్నారు. మూడేళ్లుగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి హైమాక్స్ లైట్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. సంగం వాగు కూడలిలో వెలుతురు సమస్యను పరిష్కరించి రాత్రివేళ వాహనదారులకు భద్రత కల్పించాలని





విజ్ఞప్తి చేస్తున్నారు.

ముళ్ల పొదల మధ్య వర్ధన్నపేట - అన్నారం ప్రధాన రహదారి

- రోడ్డుపైకి వాలిన పిచ్చి మొక్కలు.. ప్రమాదాల ముప్పులో వాహనదారులు



వరంగల్/ వర్ధన్నపేట, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట నుంచి అన్నారం వెళ్లే ప్రధాన రహదారి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు విచ్చలవిడిగా పెరిగి రోడ్డుపైకి వాలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో రోడ్డు పక్కకు వెళ్లాల్సి వస్తే ముళ్ల పొదలు ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రహదారి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. రహదారి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ రోడ్డు పక్కన పెరిగిన ముళ్ల పొదలను తొలగించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను వెంటనే తొలగించి వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి డబుల్ బెడ్‌రూం ఇళ్లు.. పేదల ఎదురుచూపులు

- జమ్మికుంటలో ఏళ్లుగా నిలిచిన నిర్మాణాలు.. పూర్తయిన ఇళ్లూ ధ్వంసం



కరీంనగర్ జిల్లా/ జమ్మికుంట, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. పేద ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమాచారం ప్రకారం ఈ ప్రాంతంలో సుమారు 240 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టగా, ప్రస్తుతం సుమారు 24 ఇళ్లు మాత్రమే నివాసానికి అనుకూలంగా కనిపిస్తున్నాయి. మిగిలిన ఇళ్లలో కొన్ని ఫౌండేషన్, పిల్లర్ దశలోనే నిలిచిపోగా, మరికొన్ని నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. నిర్మాణం పూర్తయినట్లు కనిపిస్తున్న కొన్ని ఇళ్లలోనూ తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రి ధ్వంసమై నిరుపయోగంగా మారుతున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణాలు పేదలకు అందకుండా ఇలా వృథాగా పాడై పోతుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అర్హులైన పేద కుటుంబాలు సొంతింటి కోసం ఎదురుచూస్తుండగా.. మరోవైపు నిర్మాణంలో ఉన్న ఇళ్లు సంరక్షణ లేక దెబ్బతింటున్నాయని పేర్కొంటున్నారు. వెంటనే సంబంధిత హౌసింగ్, జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా ఇళ్లను కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇళ్లు మరింత దెబ్బతినకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పేదల సొంతింటి కలను నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

భూమిలో నిర్మాణాలు కూల్చివేత.. గైనేని రాజుపై కేసు నమోదు

- ఉర్సు శివారులో పిల్లర్లు, గోడలు కూల్చివేతపై మిల్స్‌కాలనీ పోలీసుల చర్య



వరంగల్, ఆగస్టు 31 (నిత్యం నిఘా):వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో భూమిలో నిర్మిస్తున్న పిల్లర్లు, గోడలను కూల్చివేసిన ఘటనపై గైనేని రాజుతో పాటు మరికొందరిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసులు, ఫిర్యాదుదారుడి వివరాల ప్రకారం.. ఉర్సు శివారులోని సర్వే నంబర్లు 271, 272, 273లో సముద్రాల స్వామి తన భూమిలో పిల్లర్లు ఏర్పాటు చేసి గోడల నిర్మాణం చేపడుతున్న సమయంలో హనుమకొండ విద్యుత్‌నగర్‌కు చెందిన గైనేని రాజు, ఆయన పెద్ద కుమారుడు శ్రీనివాస్, చిన్న కుమారుడు భూపేష్ తదితరులు అక్కడికి వచ్చి అక్రమంగా నిర్మాణాలను కూల్చివేశారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై బాధితుడు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఫిర్యాదును స్వీకరించిన మిల్స్‌కాలనీ సీఐ కరె స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తులో వెల్లడించాల్సి ఉంది.

Nityam Nigha 01.09.26_Layout 1 9/1/2026 6:52 AM Page 11

ఆరు దశాబ్దాల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

- నారాయణపురంలో 1,400 ఎకరాలకు పైగా భూమికి 790 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు
- రాష్ట్రవ్యాప్తంగా 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే
- వరంగల్–హనుమకొండ అర్బన్‌లో 960 ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి నిర్ణయం
- అర్హులైన పేదల భూములు 22(ఏ)లో ఉంటే పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి



హనుమకొండ, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ హక్కుల విషయంలో రైతులకు ఎలాంటి వివాదాలు లేకుండా స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని తెలిపారు.
మంత్రివర్యులు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో భూ సర్వే, 22(ఏ) నిషేధిత జాబితా సవరణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై పలు కీలక అంశాలను వెల్లడించారు.

★ ఆరు దశాబ్దాల సమస్యకు పరిష్కారం
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో సుమారు ఆరు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. సుమారు 1,400 ఎకరాలకు పైగా భూమికి సంబంధించి 790 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

★ 70 గ్రామాల్లో సమగ్ర భూ సర్వే
రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతగా 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. భూములపై స్పష్టమైన హక్కులు కల్పించి, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా చూడటమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. వివాదాలు లేని భూ హక్కులను రైతులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

★ 22(ఏ) జాబితాపై సవరణలు
గత ప్రభుత్వ హయాంలో లేదా పొరపాటున 22(ఏ) నిషేధిత జాబితాలో చేర్చిన ప్రభుత్వేతర భూములను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా అర్హులైన పేదలు, రైతులకు చెందిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

★ఇందిరమ్మ ఇళ్లలో వరంగల్ అగ్రస్థానం
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మొదటి విడతలో 3,500 ఇళ్లను పూర్తి దశకు తీసుకువచ్చి వరంగల్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. రెండో విడతలో మరో a2,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు.

★ అర్బన్ పేదలకు 960 ఇందిరమ్మ టవర్లు
హైదరాబాద్, నిజామాబాద్ తరహాలో వరంగల్–హనుమకొండ అర్బన్ పరిధిలోని నిరుపేదల కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో 480 చొప్పున మొత్తం 960 ఇందిరమ్మ టవర్లను నిర్మించాలని నిర్ణయించామని చెప్పారు. అర్బన్ ప్రాంతాల్లోని నిరుపేదలకు రూపాయి రిజిస్ట్రేషన్ ఛార్జీ కూడా లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇళ్లను అప్పగిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

★ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలి
ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

గుంతలమయంగా మంథని - చిన్న ఓదాల రహదారి



- విద్యార్థులు, ప్రయాణికులకు నరకయాతన.. వర్షం వస్తే గుంతల్లో నీరే
- భారీ ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం.. మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్

పెద్దపల్లి జిల్లా / మంథని, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మండల కేంద్రానికి పట్టుమని పది కిలోమీటర్ల దూరం లేని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోపాల్‌పూర్, చిన్న ఓదాల, జిల్లాలపల్లి గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి గుంతలమయంగా మారడంతో విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, వితనాలు, ఎరువులు తెచ్చుకునే వారు, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే ప్రజలకు ఈ రహదారే ప్రధాన ఆధారం. అయితే రహదారి పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ మోకాలి లోతు గుంతలు.. వర్షం వస్తే చెరువులే!
రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు మోకాలి లోతు వరకు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే విద్యార్థులు భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు.

గుంతల్లో వాహనాల చక్రాలు దిగిపోవడంతో అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ భారీ ఇసుక లారీలే కారణమా?
గోపాల్‌పూర్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలించే భారీ లారీలే రహదారి దుస్థితికి ప్రధాన కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది ఇసుక లారీలు ఈ రహదారిపై రాకపోకలు సాగించడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని పేర్కొంటున్నారు. మానేరు ఇసుక ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ, రహదారి మరమ్మతులకు తగిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీల రాకపోకల కారణంగా రహదారి దెబ్బతింటున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

★ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి
విద్యార్థులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మంథని–చిన్న ఓదాల రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, అవసరమైతే పూర్తిస్థాయిలో కొత్త రహదారిని నిర్మించాలని గోపాల్‌పూర్, చిన్న ఓదాల, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించకపోతే రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ '420' పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

- సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు నిరసనలు
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందంటూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శలు



పెద్దపల్లి జిల్లా / రామగుండం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం '420 పాలన' కొనసాగిస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 420 హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని చందర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని, నమ్ముకున్న ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గని కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనం కల్పించడం లేదని ఆరోపించారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి అన్యాయం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్‌హరి మాట్లాడుతూ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు.

★ సెప్టెంబర్ 2 నుంచి 'సమరశంఖం'
కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి రామగుండం నియోజకవర్గంలో 'సమరశంఖం' పేరుతో వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రభుత్వ విధానాలపై తమ వాదనను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. కార్మికులు, ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబానికి సమయం కేటాయించాలి

- ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబానికి సమయం కేటాయించాలి



పెద్దపల్లి జిల్లా / రామగుండం, ఆగస్టు 31 (నిత్యం నిఘా ప్రతినిధి):పోలీసు ఉద్యోగం నుంచి పదవీ విరమణ అనంతరం అధికారులు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ ఎం. రవీందర్, ఏఎస్ఐలు బసవ దీపక్, దుంపల కొమురయ్య, హెడ్ కానిస్టేబుల్ చిలుముల మధునయ్యలను సోమవారం సీపీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో వారు అందించిన సేవలు, చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. వారి సేవలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ యోగా, వ్యాయామం వంటి వాటికి సమయం కేటాయించి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏఆర్ఓ రమేష్, సీసీ సందీప్, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.